నా నంబర్ ఎప్పుడొస్తదో!

- కబంధ'హస్తా'ల్లో కొనుగోలు కేంద్రాలు
- ఎమ్మెల్యే చెప్పినోళ్లకే కేంద్రాలు
- రూ. 50 వేలకు బేరసారాలు
- కొనుగోలు చేసినా డబ్బులు పడవు
- అదును చూసి ప్రైవేటు వ్యాపారుల ఎంట్రీ
- ముందస్తు చెల్లింపుల పేరుతో టోకరా

కోనుగోలు కేంద్రాల్లో రైతన్న ఎదురుచూపు

నల్లగొండ మండలం ఆర్జాలబావి వద్ద ఉన్న పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో ఉన్న ధాన్యం రాశులు

మంచిర్యాల, సిద్దిపేట, నిజామాబాద్, నల్లగొండ, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): పదేండ్ల కాలంలో రైతులు ఎన్నడూ అనుభవించని కష్టాలను ఈ మూడు నెలల్లోనే చవిచూశారు. కరువు, అకాల వర్షాలకు పంట పోగా..మిగిలిన పంటనైనా అమ్ముకుని అప్పులు తీర్చుకుందామంటే ధాన్యం కొనుగోళ్ల కేంద్రాల రూపంలో మరో కష్టం వచ్చి పడింది. తమ నంబరు ఎప్పుడొస్తుందో తెలియక రైతులు ధాన్యం కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. దీనికితోడు కొనుగోళ్లలోనూ రాజకీయాలు రాజ్యమేలుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇదే తీరు నెలకొన్నది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన ధాన్యానికి సొమ్ము ఎప్పుడు తమ ఖాతాల్లో జమ అవుతుందో తెలియక రైతులు అయోమయ పరిస్థితి ఎదుర్కొంటున్నారు.

కేటాయింపుల్లో గందరగోళం

మంచిర్యాల జిల్లాలో మొదట డీఆర్‌డీఏ, పీఏసీఎస్ ఏజెన్సీల ద్వారా 235 కేంద్రాలు ఏర్పాటు చేస్తామని అధికారులు ప్రకటించారు. ఆ తర్వాత డీసీఎంఎస్ ఏజెన్సీని కలుపుకొని 262 కేంద్రాలని చెప్పారు. మూడోసారి మంచిర్యాల నియోజకవర్గంలో పీఏసీఎస్‌లు వద్దంటూ మెప్మా ఏజెన్సీని చేర్చుకొని జిల్లాలో 275 సెంటర్లు పెడుతున్నట్టు ఏప్రిల్ మొదటి వారంలో ఓ సైనేడ్ కాపీని విడుదల చేశారు. తాజాగా, జాయింట్ కలెక్టర్ ఇదే విషయంపై స్పందిస్తూ 262 కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. డీసీఎస్‌వోను అడిగితే కేంద్రాల లెక్క ఇంకా ఖరారు కాలేదని చెప్పి గందరగోళానికి తెరతీశారు.

రూ. 50 వేలకు ఓ కేంద్రం!

ధాన్యం కొనుగోలు కేంద్రాలలోనూ అవినీతి రాజ్యమేలుతున్నది. ఒక్కో కేంద్రం ఏర్పాటుకు రూ. 50 వేలు డిమాండ్ చేస్తున్నట్టు తెలిసింది. జైపూర్ మండలంలో ఒకే వ్యక్తికి బినామీ పేర్లతో నాలుగు సెంటర్లు ఇచ్చినట్టు తెలిసింది. కన్నెపల్లి మండలంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు అన్నదమ్ములకు కొనుగోలు కేంద్రాలు కేటాయించినట్టు తెలిసింది. జైపూర్ మండలం శివ్వారం గ్రామానికి చెందిన ఆర్న సమ్మయ్య డీసీఎంఎస్ కోసం రూ. 3 లక్షల డిపాజిట్ చెల్లించారు. అంతలోనే స్థానిక ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి చెప్పిన మరో వ్యక్తికి టీసీఎంఎస్ కేంద్రాన్ని కేటాయించారు. దీనిపై సమ్మయ్య రాష్ట్ర ముఖ్య ఎన్నికల కమిషనర్ వికాస్‌రాజ్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయన శివ్వారంలో కొత్త డీసీఎంఎస్ సెంటర్ ఇన్‌చార్జి నియామకాన్ని ఆపేయాలంటూ జిల్లా అధికారులకు మెమో ఇచ్చారు.

సిద్దిపేటలో అంతంత మాత్రంగా కొనుగోళ్లు

సిద్దిపేట జిల్లాలో మొత్తం 418 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్టు అధికారులు తెలిపారు. ఈ నెల 1 నుంచి కొనుగోళ్లు ప్రారంభించినప్పటికీ పూర్తిస్థాయిలో జోరందుకోలేదు. ఇప్పటి వరకు 167 మంది రైతుల నుంచి 876 టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారు. 81 మంది రైతుల పేర్లను మాత్రమే ట్యాబ్‌లో నమోదు చేశారు. సోమవారం నాటికి రూ. 49 లక్షలు రైతుల ఖాతాలో జమ చేయాల్సి ఉండగా ఇంకా జమ కాలేదు. హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల్లోని కొనుగోలు కేంద్రాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొన్నది. ఈ రెండు మండలాల్లో కలిపి పీఏసీఎస్ ఆధ్వర్యంలో 27 సెంటర్లకు కేవలం 5 సెంటర్లలో మాత్రమే కొనుగోళ్లు చేస్తున్నారు. ఐకేపీ ఆధ్వర్యంలోని 13 సెంటర్లకు గాను 3 సెంటర్లలోనే కొనుగోళ్లు జరుగుతున్నాయి.

ప్రైవేటు వ్యాపారుల హవా

నిజామాబాద్ జిల్లాలో రైతుల పరిస్థితి మరోలా ఉన్నది. టోకెన్ నంబరు ఎప్పుడొస్తుందో తెలియక వేచి చూసేకంటే ప్రైవేటు వ్యాపారులకే పంటను తెగనమ్ముకోవడం మేలని రైతులు భావిస్తున్నారు. ఇదే అదునుగా వ్యాపారులు పొలాల్లో వాలిపోతున్నారు. సన్న రకం వడ్లను రూ. 2 వేలకే కొనుగోలు చేస్తూ రైతన్నను దారుణంగా ముంచుతున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కనీస మద్దతు ఏ గ్రేడ్ రకానికి రూ.2,203, బీ గ్రేడ్ రకానికి రూ.2,183 చొప్పున దక్కుతుండగా దళారులు మాత్రం తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. బహిరంగ మార్కెట్లో సన్నాలకు భారీ డిమాండ్ ఉన్నా ముందస్తు చెల్లింపుల పేరిట బురిడీ కొట్టిస్తున్నారు.

వారం రోజులకు కాంటా

నల్లగొండ జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోళ్ల కోసం ఈ నెల 1న 370 కేంద్రాలు ఏర్పాటు చేశారు. సోమవారం నాటికి జిల్లాలో మొత్తం 14,680 మంది రైతుల నుంచి రూ.227.71 కోట్ల విలువైన 1,03,363 టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. 4,732 మంది రైతులకు రూ.77.68 కోట్లను చెల్లించారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చిన వారం రోజులకు కాంటా వేస్తుండడంతో అకాల వర్షం ఎప్పుడొచ్చి మీద పడుతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

దొడ్డు రకం ధాన్యం కూడా కొనుగోలు

మిల్లర్లు ఈసారి రైతుల నుంచి దొడ్డురకం ధాన్యం కూడా కొనుగోలు చేస్తున్నారు. మిల్లర్లు సాధారణంగా సన్నాలను మాత్రమే రైతుల నుంచి కొనుగోలు చేస్తుంటారు. కరువు పరిస్థితులు, నీటి ఎద్దడి కారణంగా దిగుబడి పడిపోయింది. ఫలితంగా వచ్చే సీజన్ వరకు మిల్లులు నడిపేందుకు ధాన్యం లభించడం లేదు.ఈ నేపథ్యంలో మిల్లర్లు సన్నాలతోపాటు దొడ్డురకాలను కూడా కొనుగోలు చేస్తున్నారు. మద్దతు ధర రూ. 2,203 కాగా, మిల్లర్లు రూ. 1800 నుంచి రూ. 2 వేల వరకు చెల్లిస్తున్నారు. తేమ, తాలుతో లేకుండా నేరుగా మిల్లుల వద్దే కొనుగోలు చేస్తుండడంతో రైతులు అటువైపే మొగ్గు చూపుతున్నారు.

ఎమ్మెల్యేలు చెప్పినోళ్లకే కొనుగోలు కేంద్రాలు

మంచిర్యాల జిల్లాలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చెప్పినోళ్లకే కొనుగోలు కేంద్రాలు కేటాయిస్తుండడం తీవ్ర విమర్శలకు దారితీసింది. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటికీ పలానా వాళ్లకే కేంద్రాలు కేటాయించాలంటూ అధికారులకు ఎమ్మెల్యేలు లేఖలు రాస్తున్నారు. ఈ మేరకు చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఈ నెల 8న జాయింట్ కలెక్టర్‌కు రాసిన లేఖ ఒకటి బయటకు వచ్చింది. కేసీఆర్ ప్రభుత్వం రైతులకు ఇబ్బంది కలగకుండా డీసీఎంఎస్, పీఏసీఎస్, డీఆర్‌డీఏ(ఐకేపీ), మెప్మా ఏజెన్సీల ద్వారా ధాన్యం కొనుగోలు చేసింది. దాదాపు తొమ్మిదేండ్లు అవే కేంద్రాలు నడుస్తూ వచ్చాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తొలిసారి చేస్తున్న ధాన్యం కొనుగోళ్లలోనే పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు రాజకీయాలు ప్రారంభించారు. పీపీ సెంటర్ ఇన్‌చార్జీలను తీసేసి వారి స్థానంలో కాంగ్రెస్ నాయకులకు, వారి బినామీలకే కేంద్రాలు ఇవ్వాలంటూ లేఖలు రాస్తున్నారు.

ఎమ్మెల్యే చెప్పినోళ్లకే ఇస్తమంటున్నరు

నాకు బూరుగుపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఉంది. కొన్నేండ్లుగా ధాన్యం కొనుగోలు చేస్తున్నా. ఇందుకోసం ఏజెన్సీకి రూ.3 లక్షలు డిపాజిట్ చేశాను. యాసంగిలో ఎమ్మెల్యే జోక్యంతో నా స్థానంలో మరొకరికి కేంద్రం కేటాయిస్తున్నారు. అధికారులను అడిగితే ఎమ్మెల్యే చెప్పినోళ్లకే ఇస్తామని, కావాలంటే ఎమ్మెల్యే దగ్గరికి వెళ్లాలని అంటున్నరు. జేసీని కలిసినా న్యాయం జరగడం లేదు. నాకు న్యాయం జరగకుంటే కోర్టుకెళ్తా.

-రాజ్‌కుమార్, బూరుగుపల్లి, భీమారం మండలం మంచిర్యాల

ఆరు రోజులవుతున్నది

సిద్దిపేట మార్కెట్ యార్డుకు వడ్లు తెచ్చి ఆరు రోజులవుతాంది. రోజూ వడ్లు ఎండ బోస్తున్నం. ఈ రోజు కొంటాం రేపు కొంటమని అంటున్నరు. తేమ శాతం పరీక్ష చేయలేదు. వాన మొగులైతే భయమవుతాంది.

-కొల్పుల నర్సయ్య, రైతు, ఎన్సాన్‌పల్లి, సిద్దిపేట జిల్లా

బోనస్ 500 ఇవ్వాలి

కాంగ్రెస్ హామీ ప్రకారం క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వాలి.మూడెకరాల్లో వరి సాగుచేసిన. కొంత ఎండిపోగా పండిన పంటకు బోనస్ ఇస్తే మాలాంటి రైతులకు నష్టం జరగకుండా ఉంటుంది.ముందుగా వడ్లు అమ్ముకున్న రైతులు డబ్బులు ఎప్పుడు పడుతాయా అని ఎదురు చూస్తున్నరు.

-అన్నాడి ప్రభాకర్‌రెడ్డి, రైతు, హుస్నాబాద్, సిద్దిపేట జిల్లా

15వేల ఎకరాల్లో పంట నష్టం

అకాల వర్షాల పంటనష్టం లెక్క తేల్చిన వ్యవసాయశాఖ

15 వేల మంది రైతులకు ఎకరాకు రూ. 10 వేలు

రూ.15 కోట్ల పరిహారం ఇచ్చేందుకు నిర్ణయం

హైదరాబాద్, ఏప్రిల్ 15(నమస్తే తెలంగాణ): గత నెలలో రాష్ట్రంలో కురిసిన అకాల వర్షాల వల్ల కలిగిన పంట నష్టం లెక్కలను వ్యవసాయ శాఖ తేల్చింది. మొత్తం 10 జిల్లాల్లో 15,812 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్టు వెల్లడించింది. పంటలు దెబ్బతినడం వల్ల 15,246 మంది రైతులకు నష్టం వాటిల్లినట్టు తేల్చింది. నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ. 10వేల చొప్పున పరిహారం అందిస్తామని గతంలోనే ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో 15,812 ఎకరాలకుగానూ రూ. 15.81 కోట్ల పరిహారం అందించాలని నిర్ణయించింది. ఈ పరిహారాన్ని వారం రోజుల్లో రైతులకు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకోసం ఇప్పటికే ఎన్నికల కమిషన్‌కు ప్రభుత్వం లేఖ రాసింది. ఈసీ అనుమతి రాగానే పంట నష్టపరిహారం రైతులకు అందజేయనుంది. అయితే సుమారు 30వేల ఎకరాల్లో పంటలకు నష్టం జరిగితే ప్రభుత్వం కేవలం 15 వేల ఎకరాల్లోనే నష్టం జరిగినట్టు అంచనా వేయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాల వారీగా పంటనష్టం విస్తీర్ణం వివరాలు

జిల్లా	పంట నష్టం విస్తీర్ణం	రైతులు
కామారెడ్డి	10328.04	9107
నిజామాబాద్	1652.25	1809
సిరిసిల్ల	1014.06	1036
సిద్దిపేట	746.30	793
మెదక్	714.17	957
ఆదిలాబాద్	545.09	370
నిర్మల్	332.17	519
మంచిర్యాల	244.01	376
కరీంనగర్	160.10	160
సంగారెడ్డి	76.04	119
మొత్తం	15812.23	15246

మూడు ప్రాజెక్టులపై సీడబ్ల్యూసీ ఆరా

హైదరాబాద్, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ) : పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి కేటాయించిన 45టీఎంసీలపై వివరాలు ఇవ్వాలని కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) రాష్ట్రాన్ని కోరింది. బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం కృష్ణా బేసిన్‌లో మైనర్ ఇరిగేషన్ కింద తెలంగాణకు కేటాయించిన 90 టీఎంసీలు కేటాయించిన సంగతి తెలిసిందే. ఇందులో 45 టీఎంసీలు ఆదా కాగా.. ప్రభుత్వం వాటిని పాలమూరు రంగారెడ్డి పథకానికి కేటాయించింది. ఈ నేపథ్యంలో 2012-13 నుంచి 2021-23 వరకు ఏ విధంగా నీటిని పొదుపు చేశారో తెలుపాలని సీడబ్ల్యూసీ సూచించింది. రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర వివరాలు అందించి, నీటి కేటాయింపుపై సీడబ్ల్యూసీ క్లియరెన్స్ ఇస్తే 45 టీఎంసీలతో పాలమూరు డీపీఆర్‌కు ఆమోదం లభించే అవకాశం ఉన్నదని అధికారులు చెప్తున్నారు. మరోవైపు సమ్మక్క బరాజ్ నిర్మాణానికి ఛత్తీస్‌గఢ్ నుంచి రావాల్సిన నిరభ్యంతర పత్రం(ఎన్వోసీ)పైనా సీడబ్ల్యూసీ ఆరా తీసింది. ఈ బరాజ్ నుంచి దేవాదుల ఎత్తిపోతలకు 38 టీఎంసీలు, శ్రీరాంసాగర్ రెండో దశకు 47 టీఎంసీలు తరలించాలని రాష్ట్రం ప్రతిపాదించింది. ఈ నీటి లభ్యతపై సీడబ్ల్యూసీ వివరాలు కోరింది. దీంతోపాటు సీతారామ ఎత్తిపోతల పథకం కింద సాగుపైనా సీడబ్ల్యూసీ ఆరా తీసింది. ఒక్కో హెక్టారుకు 79.07 క్వింటాళ్ల వడ్లు లేదా 49.42 క్వింటాళ్ల పత్తి, 69.19 క్వింటాళ్ల మక్కజొన్న పండుతుందని డీపీఆర్‌లో పేర్కొన్నది. ఈ దిగుబడి ఎలా సాధ్యమో చెప్పాలని సూచించింది.

ఇచ్చంపల్లి వద్దే బరాజ్

- తెలంగాణ అభ్యంతరాలు పట్టించుకోని కేంద్రం
- ఎన్నికల వేళ హడావుడిపై నిపుణుల అనుమానాలు

హైదరాబాద్, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ): గోదావరి-కావేరీ అనుసంధానం ప్రాజెక్టులో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలం ఇచ్చంపల్లి వద్ద 87 మీటర్ల ఎత్తుతో బరాజ్ నిర్మించనున్నట్టు జాతీయ జలవనరుల అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) తేల్చి చెప్పింది. ఈ మేరకు ముసాయిదా డీపీఆర్‌ను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించింది. ఇందులో బరాజ్ నిర్మాణ ప్రదేశం, నీటి లభ్యత, కేటాయింపులపై తెలంగాణ లేవనెత్తిన అభ్యంతరాలను కేంద్ర ప్రభుత్వం పూర్తిగా పక్కన పెట్టేసింది. నెలాఖరులోగా అభ్యంతరాలు/సూచనలు/సలహాలు తెలియజేయాలని ఎన్‌డబ్ల్యూడీఏ సూచించింది. లేకపోతే ఆమోదించినట్టుగా (డీమ్డ్ టు అప్రూవల్) భావిస్తామని స్పష్టం చేసింది. ఆ తర్వాత తెలంగాణ, ఏపీ, ఛత్తీస్‌గఢ్, తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక, పుదుచ్చేరి రాష్ట్రాల ముఖ్యమంత్రుల సంతకాలు తీసుకుంటామని తెలిపింది. ఎన్‌డబ్ల్యూడీఏ నదుల అనుసంధానంపై ఇన్నేండ్లుగా మౌనంగా ఉండి, సార్వత్రిక ఎన్నికల వేళ డీపీఆర్‌ను పంపడంపై నిపుణులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. పైగా నెలాఖరులోగా అభ్యంతరాలు తెలుపాలని, సీఎంలు సంతకాలు చేయాలన్న నిబంధనపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తర్వాత ప్రభుత్వాలు విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడానికి వీల్లేదని గుర్తు చేస్తున్నారు. ఆయా రాష్ట్రాల సీఎంలు సంతకాలు చేయాలంటే ఎన్నికల సంఘం అనుమతి తప్పనిసరి తీసుకోవాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో కేంద్రం చర్యలు అనుమానాస్పదంగా ఉన్నాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మిల్లుల్లో ఖాళీ స్థలం పెంచేందుకు చర్యలు

'నమస్తే తెలంగాణ'కథనానికి సివిల్ సప్లై వివరణ

నమస్తే ఎఫెక్ట్

హైదరాబాద్, ఏప్రిల్ 15(నమస్తే తెలంగాణ): యాసంగి ధాన్యం కొనుగోళ్లు ఊపందుకునే సమయానికి మిల్లుల్లో ఖాళీ స్థలం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్టు పౌరసరఫరాల శాఖ వెల్లడించింది. సోమవారం నమస్తే తెలంగాణలో 'యాసంగి ధాన్యానికి చోటేది..' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆ శాఖ వివరణ ఇచ్చింది. నిరుడు యాసంగికి చెందిన 35 లక్షల టన్నుల ధాన్యాన్ని వేలం వేసినట్టు పేర్కొంది. వేలంలో ధాన్యాన్ని దక్కించుకున్న సంస్థలు క్రమంగా ధాన్యాన్ని తరలిస్తున్నాయని తెలిపారు. యాసంగి కొనుగోళ్ల వేగం పుంజుకునేలోపు మిల్లుల్లో ధాన్యం నిల్వలకు అవసరమైన స్థలాన్ని అందుబాటులోకి తెస్తామని చెప్పారు.

ఎస్సారెస్పీ నీళ్లు ఇవ్వాలి

ఆరుగాలం కష్టపడి పండించిన పంట చివరి దశలో ఉందని, ఎస్సారెస్పీ కెనాల్ ద్వారా వెంటనే డీ-91, 92, 93 కాలువలకు నీటిని విడుదల చేయాలని సోమవారం కరీంనగర్ జిల్లా రామడుగు మండలంలో కొక్కెరకుంట వద్ద ఆందోళన నిర్వహిస్తున్న రైతులు

- చొప్పదండి, ఏప్రిల్ 15

వరి కొయ్యల మంటల్లో చిక్కుకొని రైతు మృతి

మాడ్గులపల్లి, ఏప్రిల్ 15: పొలంలో వరి కొయ్యలు తగులబెడుతుండగా ప్రమాదవశాత్తు నిప్పంటుకొని రైతు మృతిచెందాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం చెరుపల్లి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బొల్లం లింగయ్యాయాదవ్(80) యాసంగిలో తనకున్న నాలుగు ఎకరాల్లో వరిసాగు చేశాడు. కోతలు పూర్తయ్యాక పొలంలో మిగిలిన వరి కొయ్యలకు నిప్పు పెట్టేందుకు ఉదయమే పొలానికి వెళ్లాడు. గడ్డికి నిప్పంటించగా గాలికి మంటలు ఒకేసారి విస్తరించాయి. ఆ వేడికి తట్టుకోలేక లింగయ్య కిందపడిపోయాడు. ఈ క్రమంలో రైతు మంటల్లో చిక్కుకొని కాలిపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన చుట్టుపక్కల రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

30 లక్షల టన్నుల పారాబాయిల్డ్ బియ్యం సేకరిస్తాం : కేంద్రం

హైదరాబాద్, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ): ఈ ఏడాది యాసంగి, వానకాలం సీజన్లలో రాష్ట్రం నుంచి 30 లక్షల మెట్రిక్ టన్నుల పారాబాయిల్డ్ బియ్యాన్ని సేకరించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు తక్షణ చర్యలు చేపట్టాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. కేంద్రం నిర్ణయంతో రైతులకు ఎంతో మేలు కలుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మద్దతు ధరతోపాటు రూ.500 బోనస్ చెల్లించి ధాన్యాన్ని సేకరించాలని డిమాండ్ చేశారు.

మంత్రి ఉత్తమ్ కోతలు!

- వడ్ల కొనుగోళ్లు, ధాన్యం టెండర్లు పౌరసరఫరాల సంస్థ అప్పులపై అభాసుపాలు
- మొన్న కమిషనర్ ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌నే మళ్లీ ఇచ్చిన మంత్రి
- అందులోనూ అవగాహనా రాహిత్యం

హైదరాబాద్, ఏప్రిల్ 15(నమస్తే తెలంగాణ): ధాన్యం కొనుగోళ్ల వ్యవహారంపై గాంధీ భవన్‌లో సోమవారం మీడియా సమావేశం నిర్వహించిన పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బడాయి మాటలు చెప్పబోయి అభాసుపాలయ్యారు. ఇదే అంశంపై ఆ శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ శనివారం మీడియా సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించగా, రెండు రోజుల తర్వాత తిరిగి సోమవారం మంత్రి ఉత్తమ్ కూడా అదే పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చి, అవే మాటలు వల్లెవేశారు. అంతేకాకుండా, పౌరసరఫరాల సంస్థ అప్పులపై డీఎస్ చౌహాన్ మాట్లాడిన దానికి భిన్నంగా చెప్పి, అవగాహనా రాహిత్యాన్ని ప్రదర్శించారు.

మీడియా సమావేశంలో ఉత్తమ్ చెప్పిన విషయాల్లో కొన్ని అంశాలు వాస్తవాలకు భిన్నంగా ఉండటం గమనార్హం.

ఉత్తమ్: పౌరసరఫరాల సంస్థ అప్పులను రూ.58 వేల కోట్ల నుంచి రూ.5 వేలకు తగ్గించాం.

వాస్తవం: శనివారం మీడియాతో మాట్లాడిన పౌరసరఫరాల శాఖ కమిషనర్ చౌహాన్.. సంస్థ అప్పులు మొన్నటివరకు రూ.58 వేల కోట్లు ఉండగా, ఇందులో గత మూడు నెలల్లో రూ.5 వేల కోట్ల అప్పును తగ్గించినట్టు తెలిపారు. అంటే కమిషనర్ లెక్కల ప్రకారం కార్పొరేషన్ అప్పు రూ.53 కోట్లు. కానీ, మంత్రి ఉత్తమ్ మాత్రం రూ. 58 వేల కోట్ల అప్పును రూ.5 వేల కోట్లకు తగ్గించినట్టు చెప్పడం గమనార్హం.

ఉత్తమ్: గత ప్రభుత్వం ఎలాంటి సెక్యూరిటీ లేకుండా రూ.22 వేల కోట్ల ధాన్యాన్ని మిల్లర్లకు అప్పగించింది.

వాస్తవం: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం కొనుగోలు చేసిన యాసంగి ధాన్యాన్ని కూడా గతంలో మాదిరిగానే మిల్లర్లకే అప్పగిస్తున్నది. ఇందుకోసం ఎలాంటి సెక్యూరిటీ తీసుకోలేదు. కానీ, మంత్రి మాత్రం గతానికి భిన్నంగా తామేదో మార్పులు చేసినట్టు చెప్పడం గమనార్హం.

ఉత్తమ్: ధాన్యం వేలంలో గతం కన్నా రూ.1,100 కోట్ల అదనంగా ఆదాయం వచ్చింది.

వాస్తవం: గత ప్రభుత్వంలో క్వింటా ధాన్యానికి సగటున రూ.1,760 చొప్పున ధర పలికింది. అయితే, ధర తక్కువ రావడంతో కార్పొరేషన్‌కు నష్టం వస్తుందనే ఉద్దేశంతో గత ప్రభుత్వం ఆ టెండర్‌ను రద్దు చేసింది. ఇలా రద్దు చేసిన టెండర్ ధరతో పోల్చుతూ మంత్రి ఉత్తమ్ కాంగ్రెస్ ప్రభుత్వం వేసిన టెండర్ల గురించి గొప్పలు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన ధాన్యం వేలంలో క్వింటాకు సగటు ధర రూ.2,022 వచ్చిందని తెలిపారు. ఇందులో అసలు ధాన్యం ధర రూ.1,850 మాత్రమే ధర పలికింది. అయితే ధరను ఎక్కువ చేసి చూపేందుకు ధాన్యం ధరకు గన్నీ, మార్కెట్ ఫీజును కలిపి మొత్తం ధాన్యానికి ఎక్కువ ధర వచ్చినట్టుగా చూపడం గమనార్హం. వేలంలో విక్రయించిన ధాన్యాన్ని వ్యాపారులు ఎత్తడం లేదని మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు మంత్రి ఉత్తమ్ సమాధానం చెప్పకుండా దాటేశారు.

సీఎం చెప్పినా కొంటలేరు

➤ మొదటిపేజీ తరువాయి...

విషయంలో అప్రమత్తంగా ఉండాలి' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి ట్వీట్ చేశారు. దీంతో అప్పటివరకు క్వింటా ధాన్యానికి మద్దతు ధర రూ.2,200కు బదులు రూ.1,530 మాత్రమే ముట్టజెప్పిన వ్యాపారులు అతి కష్టం మీద మరో రూ.30 మాత్రమే పెంచారు. ఈ నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి..'రైతు పండించిన ప్రతి గింజను మద్దతు ధరకే కొంటాం.. ధర తగ్గించే వారిపై కఠిన చర్యలు ఉంటాయి' అని హెచ్చరించారు. కానీ, వరుసగా ఐదోరోజు సోమవారం కూడా జనగామ వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం, మక్కల కొనుగోళ్లలో ప్రతిష్ఠంభన కొనసాగింది. సీఎం హెచ్చరించినా, మార్కెటింగ్, రెవెన్యూ, సహకార, పౌరసరఫరాల సంస్థలకు చెందిన దాదాపు 50 మంది అధికారులు మార్కెట్‌లో పర్యవేక్షణ బాధ్యతలు చూస్తున్నా పరిస్థితి మారలేదు. దీంతో రైతులు, మహిళా రైతులు పిల్లాపాపలతో సద్దులు కట్టుకొని వచ్చి యార్డులో పడిగాపులు కాస్తున్నారు. ఇప్పటికే దాదాపు 40 వేల కుపైగా ధాన్యం బస్తాలు మార్కెట్‌లో పేరుకుపోయాయి. సహకారసంఘం, ఐకేపీ, సివిల్ సప్లై వంటి మూడు ప్రభుత్వరంగ కొనుగోలు కేంద్రాలను మార్కెట్ ఆవరణలో ఏర్పాటుచేసినా వాటి ద్వారా మద్దతు ధరకు కొనుగోలు చేసిన ధాన్యం రెండు వేల బస్తాలు మాత్రమే. ఎక్కడి రైతులైనా సరే మార్కెట్‌కు వచ్చి మద్దతు ధరకు అమ్ముకోవచ్చునని అధికారులు ప్రకటించడంతో, కొనుగోళ్లు జరగకపోయినా ప్రతి రోజూ ఉత్పత్తులు వస్తూనే ఉన్నాయి. వాటిని వెంటనే కొనే దిక్కులేకపోవడంతో ధాన్యం, మక్కల నిల్వలు మార్కెట్ యార్డులో భారీగా పేరుకుపోతున్నాయి. స్వయంగా ముఖ్యమంత్రి స్థాయిలో జోక్యం చేసుకున్నా, తేమ, తాలు, మట్టి సాకు చెప్పి జనగామ మార్కెట్‌లో ప్రభుత్వరంగ సంస్థలు నామమాత్రంగా కొనుగోళ్లు చేస్తున్నాయి. మద్దతు ధర ఇచ్చేది లేదని ట్రేడర్లు, వ్యాపారులు తెగేసి చెప్తున్నారు.

జనగామ మార్కెట్ కార్యాలయం లోపల ఆందోళన చేస్తున్న రైతులు

రైతుల ఆగ్రహ జ్వాల

సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కొనుగోళ్ల కోసం ఎదురుచూసిన రైతులు కడుపుమండి ఆందోళనకు దిగారు. పలుమార్లు మార్కెట్ కార్యాలయంలోకి వెళ్లి మార్కెటింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజునాయక్, జిల్లా మార్కెటింగ్ అధికారి నరేంద్ర, ఆర్డీవో కొమురయ్య, కార్యదర్శి శ్రీనివాస్‌ను నిలదీశారు. నిబంధనల ప్రకారం తేమ, తాలు లేని ధాన్యానికే మద్దతు ధర దక్కుతుందని, లేకుంటే రైతులు ఆరబెట్టుకునే వరకు కొనేదిలేదని అధికారులు స్పష్టంచేశారు. యార్డులో ధాన్యం కుప్ప పక్కనే మరో కుప్పపోయడంతో ఆరబెట్టుకొనే స్థలం దొరకడం లేదు. దీంతో ఐదారు రోజుల క్రితం పోసిన కుప్ప(రాశులు) మక్కి, బూజుపట్టి ధాన్యం రంగుమారుతున్నది. ఇంకా ఆగితే ధాన్యం ఎందుకు పనికి రాకుండా పోతుందనే ఆందోళనతో పలువురు రైతులు తక్కువ ధరకే ట్రేడర్లకు అమ్ముకునేందుకు సిద్ధపడ్డారు. మరికొందరు రైతులు మళ్లీ రవాణా చార్జీలు పెట్టుకొని మిల్లర్లు, బయట వ్యాపారులకు వద్దకు వాపస్ తీసుకెళ్లారు. 'యార్డులో మద్దతు ధరకు మాత్రమే కొనాలని పైనుంచి ఆదేశాలున్నాయి. బయటకు వెళ్లి మీరు ఎంతకైనా అమ్ముకోండి' అంటూ అధికారులు నర్మగర్భంగా చేస్తున్న వ్యాఖ్యలు రైతులను మరింత కోపోద్రిక్తులను చేస్తున్నాయి. 'ప్రభుత్వం మద్దతు ధరకు కొనదు. ప్రైవేట్‌కు అమ్ముకోనివ్వదు. మేం ఎన్నిరోజులు మార్కెట్‌లో పస్తులతో పడిగాపులుండాలి?' అంటూ ఆగ్రహం వ్యక్తం చేసిన రైతులు కార్యాలయంలోకి వెళ్లి తాళాలు వేసేందుకు ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కార్యాలయం ముందు ఎండుగడ్డి, చెత్తను పోగేసి మంటపెట్టి రైతులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. జిల్లా కలెక్టర్ వచ్చి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

క్వింటా 1,600కే అడుగుతున్నరు

కేసీఆర్ రైతుకు కష్టం రానివ్వలేదు. నిరుడు ఇదే సీజన్‌లో మార్కెట్‌కు తెస్తే క్వింటాకు రూ.1,900 ధర వచ్చింది. ఇప్పుడేమో షావుకారు రూ. 1,600 అంటున్నడు. అధికారులు పట్టించుకోవడం లేదు. మార్కెట్‌లో మద్దతు ధర వస్తదని ఆశపడ్డం. ఇప్పుడు వడ్లలో తేమ ఉన్నదని కొంటలేరు. ఐదారు రోజుల నుంచి ఇక్కడే కావలి ఉంటున్న. రోజుకు వంద, రెండొందల ఖర్చు అవుతున్నది.

- తూముల మల్లయ్య, మాణిక్యపురం, లింగాలఘనపురం

వానకాలం నుంచి పంటల బీమా

టెండర్లు పిలువాలని మంత్రి తుమ్మల ఆదేశం

హైదరాబాద్, ఏప్రిల్ 15(నమస్తే తెలంగాణ): వచ్చే వానకాలం సీజన్ నుంచే పంటల బీమాను అమలుకు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. పంటల బీమా ప్రతిపాదనలను పరిశీలించిన ఆయన, ఎన్నికల సంఘం అనుమతితో టెండర్ల ప్రక్రియ చేపట్టాలని సూచించారు. సోమవారం ఆయన పలు రైతు పథకాల అమలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ.. రైతులకు రుణమాఫీ చేస్తామని, అప్పటి వరకు బ్యాంకులు, పీఏసీఎస్ రైతులను రుణాల రికవరీ పేరుతో ఇబ్బందులు పెట్టొద్దని కోరారు. రైతుభరోసా పథకం వచ్చే వానకాలం నుంచే అమలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వం అన్ని రకాల పంటల కొనుగోళ్లను ప్రారంభించిందని తెలిపారు. వానాకాలం సీజన్‌కు విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమిషన్ అనుమతి రాగానే వడగండ్ల వానల పంటనష్ట పరిహారం విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని తెలిపారు.



సిద్దిపేట పత్తి మార్కెట్ యార్డులో ఉత్తరాలతో రైతులు

హామీల అమలుకు ఉత్తరాల ఉద్యమం

- ఉద్యమ గడ్డ సిద్దిపేట నుంచి శ్రీకారం
- సీఎం రేవంత్‌కు రైతుల పోస్టుకార్డులు

సిద్దిపేట, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉద్యమాల పురిటిగడ్డ సిద్దిపేట నుంచి రైతులు పోస్టుకార్డు ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని అన్నదాతలు సీఎం రేవంత్‌రెడ్డికి ఉత్తరాలు రాశారు. గత శాసనసభ ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే పార్లమెంట్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని రైతులు మార్కెట్ యార్డుల్లో పోస్టుకార్డులు రాసి హెచ్చరికలు పంపారు. సిద్దిపేట జిల్లాలోని సిద్దిపేట నియోజకవర్గంలోని సిద్దిపేట పత్తి మార్కెట్ యార్డు, చిన్నకోడూరు మార్కెట్ యార్డు, రాఘవాపూర్,సిద్దన్నపేట మార్కెట్ యార్డుల్లో సోమవారం రైతులు ఉత్తరాలు రాసి వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వీరికి బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు మద్దతు తెలిపారు. మార్కెట్ యార్డుల్లో ధాన్యం నిండిపోతున్నా రైతులకు ఇవ్వాల్సిన బోనస్‌పై ప్రభుత్వం ఇంత వరకు ప్రకటన చేయలేదు. దీనిపై రైతులు సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టులు కార్డులు రాసి నిరసనను తెలిపారు. వరి ధాన్యానికి బోనస్ రూ. 500, రైతు భరోసా కింద ఎకరాకు రూ. 15 వేలు, రైతు కూలీలకు రూ. 12 వేలు, రైతులకు రూ.2 లక్షల రూపాయల రుణమాఫీ ఎప్పుడు చేస్తారని ఆ పోస్టు కార్డుల్లో రైతులు ప్రశ్నించారు. రైతు బీమా, పంటల నష్టపరిహారం కింద రూ. 25 వేలు ఎప్పుడు ఇస్తారని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తక్షణమే స్పందించి రైతుల సమస్యలను పరిష్కరించాలని, హామీలు అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.